


# ౧ ఊరూ వాడా

మర్నాడు సుబ్బరాజు వచ్చేసరికి పొద్దువాలింది.

"బండిపట్నం వెళ్ళింది. పొలిమేరకాడాపినా, పోలీసు జులుం చేశాట్ట టాక్సు గట్టాలని, ఈ ఊరిది కాదయ్యా అని మొత్తుకున్నా వినలేదట. సైకిలేసుకెళ్ళొచ్చాను అదేదో కనుక్కుందారని" అన్నాడు కూర్చుంటూ.

"సైకిల్ని బట్టుకోలేదా మరి?" అన్నాడు రెడ్డిగారు నవ్వి. సుబ్బరాజు మందహాసం లాంటిది చేశాడు.

సుబ్బారావని నీలాటాడే... ఇలాగే ఓ దఫా సైకిలేసుకు పట్నం వెళ్లాడు (అంటూ కథ ఆరంభించారు రెడ్డిగారు) పట్నంలోనే మేనమామగారింట ఉంటూ ఇస్కూలు పైనలు దాకా బడి చదివాడనుకో, అప్పుడే చదువు కట్టిపెట్టి స్వగ్రామం వచ్చాడు. తండ్రి లేడు. తల్లి పెంపకమేమో గారంగా పెరిగాడు. అంచేత పౌరుషం, పంతం జాస్తి. నాల్రోలు ఉండేసరికీ పోతా పోతా అని పాటారంభించాడు. ఓనాడు తల్లికి సుస్తీ జేసింది. పొరుగూర్నించి డాక్టరొచ్చి చూచి ఏవో మందుల్రాసిచ్చి, పట్నం వెళ్ళి కొనిదెమ్మన్నాడు. సుబ్బారావు సైకిలెక్కి వెళ్ళాడు. మూడుకోసుల దూరం, ఊరి శివారులోనే టీ బడ్డీకాడ అప్పజెప్పి నడిచి వూళ్ళో కెళ్ళబోతున్నాడు. రెండడుగులు వేసేవరకు కనిస్టీపు కేక వినబడి వెనక్కి తిరిగాడు.

"ఈ బండి నీదేనా?" అన్నాడు కనిస్టీపు.

"ఏం?"

"లైసెన్సేది?"

"ఈ బండీ ఊరిది కాదు పల్లెటిది. దీనికి లైసెన్సక్కరలేదు"

"అది నువు జెప్పక్కర్లేదు. ఈ ఊరి పొలిమేరలో వుండగా అడుగుతున్నాను. ఇక్కడ లైసెన్సులున్నాయి."

"అది నాకూ తెల్సు. అందుకనేగా బండి నిక్కడొదిలే నడిచెళ్తున్నాను" అన్నాడు సుబ్బారావు తిక్కగా.

పోలీసులతో వాదాలు వేసుకో కూడదని తెలీని వయసు మరి, మాట మీద మాట పెరిగింది.

ఎప్పుడో ఆర్నెల్లకోసారీవెంపొచ్చి, ఊరి పొలిమేరలో కట్టేసి నడిచెళ్ళినా, లైసెన్సెందుక్కట్టాలో నాకు బోధపడలేదన్నాడు సుబ్బారావు. ఇది అన్యాయం, అక్రమం అన్నాడు. నాకయన్నీ దెలవ్వు. రూల్సు రూల్సేనన్నాడు పోలీసాయన. ఆయన్తో నీకేటి, లెంపలేసుకు మంచి చేసుకో కుర్రాడా అని చెప్పిచూశారు అక్కడివారు. అప్పటికే ఆయనకీ అతగానికీ కూడా పంతాలు మితి దాటాయేమో ఇక వెనక్కి తగ్గే వీల్లేకుండా పోయింది. కొన్ని వెవహారాల్జూడూ – అట్టే రట్టుగాకుండా ఉంటే గుట్టుగానే కామాపై పోతాయిగాని, రచ్చకంటూ ఎక్కిపోయాక ఇహ దాన్నాపడాని కెవడి శక్యవూ గాదు, పల్లెల్కేవిటి అసలు పట్నాల్లో కూడా సైకిళ్ళకి పన్ను లేకుండా చేస్తాను. అసలు సైకిలు మీద పన్నేవిటి? ఇంకో బళ్ళ మీదెయ్యండి. అద్దె సైకిళ్ళ మీదెయ్యండి. అంతే తప్ప... ఆవటాని ఉపన్యాసం కూడా ఇచ్చాడు సుబ్బారావు. కంఠ శోషే తప్ప కలిసొచ్చిందేవీ లేకపోయింది. పోలీసాయన కూడా వెళ్ళి పన్ను కట్టి లైసెన్సు బిళ్ళ పుచ్చుకోక తప్పింది కాదు. మందుకు తెచ్చింది కాస్తా ఇలా కైంకర్యమై పోయింది. ఉసూరుమంటూ ఊరివతలి కొచ్చి పొలిమేర దాటగానే ఆ బిళ్ళ పీకి నేలకేసి కొట్టి గుడ్లనీరు గుక్కుకు చక్కాపోయాడు సుబ్బారావు.

అదేమిట్రా మీ మామయ్య నడిగి తీసుకునైనా 'మందు కొనకబొయ్యావ్వూ' అని నాయనమ్మ అనేవరకూ అతనికి పొరపాటు తట్టనేలేదు.

మొత్తానికి ఆ నాడతను ప్రతిజ్ఞ పట్టాడు – పల్లెల్నించి 'చుట్టపుచూపు'గా పట్నం వచ్చే బళ్ళకు పన్నులు పడకుండా చేస్తానని. ఆ తరువాత అసలు బీదవాడి వాహనమైన సైకిలు మీద పట్నాల్లో కూడా లైసెన్సులూ, పన్నులూ లేకుండా రద్దు చేయిస్తానన్నాడు.

నాలుగేళ్ళు తిరిగేసరికి సుబ్బారావు పట్నవాసంలో కాపరం పెట్టాడు. అలనాటి ప్రతిజ్ఞ కోసం అనుకునేవు, ఆ ఉడుకు చల్లారిపోయింది. మర్చిపోయుండవచ్చు. అదుగో ఆ స్కూలు పైనలోటి చదివాడుగా. అంచేత మనం కలం తప్ప హలం పట్టరాదని తోచింది. కరణీకానికి నాలుగేళ్ళ సెలవుపెట్టి పట్నం చక్కా వచ్చాడు. కొన్నాళ్ళు ఉద్యోగం చేసినా, చురుకు పాలు చొరవ బాగా ఉన్నవాడేమో అందులో ఇవళ్ళే కివతలపడి వ్యాపారంలో జొరబడ్డాడు. కమీషన్ వ్యాపారం చేశాడు. నెమ్మది మీద ఓ లారీ కొన్నాడు. కాయితం అన్నాడు. స్థలాలు కొన్నాడు. అమ్మాడు. మునిసిపాలిటీ స్థలాలు కొందరికైతే చవగ్గా వస్తాయని గమనించాడు. వాటికెడాపెడా ఉన్నవాటికి గజం రెండూ మూడూ పలికితే, అవి మాత్రం పావలా అర్ధకీ దొరుకుతున్నాయి. అవి స్కూళ్ళూ, లైబ్రరీలూ, పార్కులూ, చౌకులూ, చట్టుబండలూ కట్టడాని కట్టేబెట్టిన బాపతు. కౌన్సిలర్లకు, ఉద్యోగస్తులకు మాత్రం సులువుగా దొరుకుతున్నాయి – ఇళ్ళు కట్టుకుందుకు.

"పోనీ నువ్వు ఓ మా రెలక్షన్లో కాస్త డబ్బు తిప్పరాదురా" అన్నాడు మేనమామ.

అదీ దాని కత. సుబ్బారావు మునిసిపలు కవున్సిల రయిందా విధంగా. అవడం బాగానే అయ్యాడు. మంచి మెజార్టీయే వచ్చింది. ఆపాటి డబ్బూ పలుకుబడీ గడించిన వాడికి ఆపాటి కసలు వేడి పూర్తిగా చల్లారిపోవాలి. కాని సుబ్బారావుదింకా కుర్రతనపు రక్తవే. ప్రజలన్నాడు, దేశవన్నాడు, సంఘవన్నాడు, సంస్కరణలన్నాడు,

బీదలన్నాడు, పన్నులన్నాడు, సాటివారూ, తోటివారూ చివాట్లేశారు. ఇంకా ఎలక్షన్ కలవరింతలేనా అని సరసమాడారు. సభల్లో చదువుగాని, ఇక్కడ మన మద్దినెందుకా కాకిగోల అని విసుక్కున్నారు. అయినా సుబ్బారావు కుదురుగా కూర్చుని తన గొడవ తను చూసుకోవడంతో ఆగలేదు. ప్రజల నిత్యావసర వస్తువుల మీద ఇన్ని పన్నులేవిటన్నాడు. ఓ పక్క చదవండోయ్ అని మొరపెడుతూ పుస్తకాల మీద సేల్సుటాక్సు లేవిటన్నాడు. వర విక్రయం మీద సేల్సుటాక్సు వెయ్యరా అన్నాడు. "నువ్వు చెప్పే గొడవలేవీ మునిసిపాల్టీ అధికారం కిందికి రావయ్యా మగడా" అని ఎద్దేవా జేశారు నలుగురూ. ఎందుకొచ్చిన అల్లరి – నీ తెలివితేటల ల్యాపించుకుందుగ్గాక పోతే అన్నారు. ప్రభుత్వం మంజూర్లు పెంచమన్నాడు సుబ్బారావు. పెంచితే ఊళ్ళో నీటివసతి పెంచి కుళాయిలు వేస్తామనీ ఆడంగులు వీధికుళాయిల దగ్గర జుట్లు పీక్కుని ఒకళ్ళ నొకళ్ళు రక్కిపోసుకోకుండా చూస్తామనీ అన్నాడు. ఆసుపత్రులలో నిజమైన మందులు ఇప్పిస్తామన్నాడు. ఊళ్ళోకి ఓ మినీస్ట్రుగారు వచ్చినప్పుడు ఓ మెమోరాండం రాసి ఇవన్నీ నివేదించాడు.

"డబ్బు మాకు మటుకెక్కడిది? అంతా పైవాడి (కేంద్రం) దయ. మీరూ మీరూ దండిగా పన్నులు కడితేనే మాకు రాబడి. మీరు స్వయం కృషితో మీ ఆదాయాన్ని వృద్ధి చేసుకోవాలి. పన్నులన్నిటిపై అజ్మాయిషీ మా చేతిలో పెట్టుకున్నామనీ, మీకు అధికారాలు తక్కువనీ వాదించి లాభంలేదు. కొత్తకొత్త పన్నులు, లైసెన్సులు కనిపెట్టండి. ఈలోగా కుళాయిల దగ్గర స్త్రీలు కలహించరాదనీ, జుట్లు పీక్కోరాదనీ పోస్టర్లు వేసి పబ్లిసిటీ ఇవ్వండి" అంటూ మంత్రిగారు చమత్కారాలతో ఛలోక్తులతో సభవారిని కడుపుబ్బ నవ్వించారు. ఆస్పత్రిలో మందుల మీద కూడా ఓ జోకు వేసేవారే గాని అయన అనుయాయి ఒకరు సకాలంలో వారించారు.

మొత్తం మీద పనులేవీ జరక్కపోయినా, జరిపించకపోయినా సుబ్బారావు మూడుసార్లు ఎన్నికయ్యాడు.

ఆ మరుసటేడే ఓ వింత జరిగింది. సుబ్బారావింటి జవాను సైకిలు మీద బజారు కెళ్ళొస్తూ ఉంటే లైసెన్సు లేదని పట్టుకుని "బందెల్దొడ్డికి" దోలేశారు బండిని. కౌన్సిలర్ సుబ్బారావుగారి బండికి లైసెన్సేటనీ జవాను నవ్వబోయాడు. తరవాత దబాయించాడు. బందీపడ్డ సైకిళ్ళవాళ్ళంతా నవ్వారు. అదేటిసార్, పెద్దోళ్ళకేనాడూ లేదు లైసెన్సు. ఈనాటికి మీరడుగుతారా అన్నారు. అదిగో ఆనాడు ఎంత రభసయ్యిందో ఈనాడూ అంతా అయింది. ఇంక వదిలేందుకు కూడా వీల్లేదు. మర్నాడు లైసెన్సు బిళ్ళ లేకుండా ఆ బండి కనిపిస్తే ఇహ నాబోరు దక్కదు. కాని అసలా బండికే మొహం చెల్లలేదు. వందలకొద్దీ సైకిళ్ళతో కలిపి లారీమీదేసి మునిసిపల్ బందికానాకు తోలేసరికి అది తుక్కయిపోయింది. అష్టవంకర్లు దిరిగింది – ఉన్నయి కాక. సుబ్బారావు అచ్చొసి మండిపడ్డాడు. బీదవాడి వాహనం – దీనికి లైసెన్సేవిటి? పన్నేవిటి? అన్యాయం అన్నాడు. పాత కల గుర్తుకొచ్చింది. పౌరుషం వేసుకొచ్చింది. ఈ మారెల్క్షనయితే ఈ పన్ను రద్దు చేయాలని ఒట్టేసుకున్నాడు. ఆ మరుసటేడే అతను ఛైయిర్మన్‌గిరికి ఎత్తువేసి నెగ్గాడు. గొప్పవాళ్ళ వాడలో మంచి పలుకుబడి ఉంది. షావుకారు చేంబరు మద్దతు ఉంది. ఆయనగారి ఉత్సాహం, చొరవ వాళ్ళకీ ముచ్చట. అభివృద్ధి గురించి, సంఘంలో విప్లవం గురించి సుబ్బారావు

చెప్పినంత ధాటిగా, నమ్మకంగా ఎవరూ కబుర్లు చెప్పలేరు. అంచేత అతని మీద సంఘాన్ని మార్చేస్తామనే వాళ్ళింకెవరూ పోటీ చేసి నెగ్గలేరు. ఇతను ఉభయతారక మంత్రం లాంటివాడు. కలవారి ఫాషను. లేనివారి పాలిట ఆశ.

పదవికొచ్చి కొద్దిరోజుల తరువాత ఇంకా అణగారని ఉత్సాహం కొద్దీ అది చేదామిది చేదామని తీర్మానాలు తయారుచెయ్యడం మొదలుపెట్టాడు. కొత్తల్లో నలుగురూ 'హాబీ బావుందని' నవ్వారు. తరువాత చప్పబడి ఆయనే తగ్గుతాడని ఊరుకున్నారు. ఆపైన ఇహ లాభం లేదని ఎదిరించారు. చాలా తీర్మానాలకి పురిట్లోనే సంధి కొట్టేటట్టు చూశారు. ఓనాడు సుబ్బారావుగారు కమిటీ మీటింగు కింకో గంట టైముందనగా "సైకిళ్ళమీద పన్నులు రద్దు చేదా"రన్నారు – తీర్మానం కాయితం తీసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ. అక్కడున్నవాళ్ళు గతుక్కుమన్నారు. "మీకేవన్నా మతిగాని పోయిందా?" అన్నారు చదువుకున్నవారు. కాసేపయ్యాక ఇది సరసం గాదనీ, సుబ్బారావు అన్నంత పనీ చేస్తాడనీ తేలడంతో తీవ్రంగా వాదాలారంభమయ్యాయి.

"మనకున్న రాబళ్ళే బహుకొద్ది. అందులో ఇది పెద్దది. ఇది తీసేస్తే ఇంకేవుంది?" అన్నారు.

"మరే లంచాలన్నీ మంచాల బడతాయి" అన్నారు 'గిట్టనివాళ్ళు' నవ్వుతూ.

"గొప్పోళ్ళు కట్టక్కర్లేనివంటూ ఏవి లేకపోతే ఇహ తేడా లెలా తెలుస్తయి?" అన్నాడింకొకాయన – తనకన్నా గొప్పవాడనుకున్న వాడికేసి ఓరకంట చూసి.

"అది కాదు సార్ ఇలాంటి పన్లన్నీ వాళ్ళు చేస్తామనేవి, అవి మనవే చేసి కూచుంటే వాళ్ళకి లాభసాటి కాదూ?"

"మంచికే కదా, వాళ్ళు చేస్తామన్నవన్నీ ఒక్క వరసన మనవే చేసేస్తూ ఉంటే మనవే మళ్ళీ మళ్ళీ ఎలక్టవుతాం. ఇంక జనానికి 'వాళ్ల' అవసరం ఏవుంటది?" అన్నాడు సుబ్బారావు.

మొత్తానికి ఆ తీర్మానం పరిశీలన ఆనాటి మీటింగు ఎజెండాలో కెక్కనిచ్చారుగాదు. నోటీసు కావాలి గదా అన్నారు. తరువాత రెండు మీటింగులూ అలాగే దాటేశారు.

"పోనీ చూసి వద్దని కొట్టెయ్యరాదూ? నేనూ రిజైను చేసి పోతాను" అన్నాడు సుబ్బారావు విసుగెత్తి.

"అమ్మమ్మ. ఇదిలా ఉట్టేన వేళ్ళాడడమే మంచిది – పై ఎలక్షనుదాకా"

"ఇలా మనం గడుసుదనం చూపిస్తే మనం ఉట్టిగట్టుకు వేళ్ళాడతామని ఊహ కాబోలు"

మొత్తం మీద ఊరంతా పాకిపోయింది. సుబ్బారావుకి చాలా మంది కృతజ్ఞత చెప్పుకున్నారు. కొన్నిచోట్ల వ్యతిరేక ప్రచారం అయినందువల్ల తిట్టుకున్నారు. సైకిలు పన్ను రద్దు చేయించాలన్న తీర్మానంకోసం సుబ్బారావు శాయశక్తులా ఎదిరించి పోట్లాడుతున్నాడని ప్రచారం చేశారు. దానాదీనా కూడా పట్టుదల పెరిగింది. దానికి తోడు చర్చలు సాగించినకొద్దీ, ఇలాంటి పన్నులు కొన్ని తగ్గించడం ధర్మమని ఇది ముందర సాధిస్తే ముమ్ముందు ఇలాంటివి మరి నాలుగు చెయ్యడానికి దారి ఏర్పడుతుందనీ తోచింది. ప్రజలు తనను ఎన్నుకొని గౌరవించినందుకు ఈపాటి అయినా చెయ్యకపోవడం ద్రోహమనిపించింది. దీనివల్ల రాబడి కొంతమేర తగ్గినా

ఆ వరకు మరికొన్ని వర్గాలపై కొన్ని అంశాలపై పన్ను వేసి భర్తీ చేసుకోవచ్చు ననిపించింది.

సాలాఖరొచ్చేవరకు సుబ్బారావు పట్టుదల పెరిగిపోయింది. రోడ్డు మీదికి చొచ్చుకు వచ్చిన దుకాణాల మీద, మున్సిపల్ స్థలాలు జబర్దస్తీగా తీసుకొని పాకవేసి కొందరు గడిస్తున్న అద్దెల మీదా, కొన్ని ఇళ్ళలో ఉన్న అదనపు కొళాయిల మీదా, ఇళ్ళ మీదా, బళ్ళమీదా, హోటళ్ళమీదా, బైస్కోపుల పోస్టర్ల మీదా ఏకాస్త పెంచినా సైకిలు పన్ను తీసెయ్యొచ్చని వాదించాడు. పన్నులేని పల్లెలనుంచి, చుట్టపు చూపుగా వచ్చేవారిని పట్టుకుని అర్నెల్ల పన్నులు వడేసి పుచ్చుకోవడం అక్రమమనీ, అది తప్పించవచ్చుననీ అన్నాడు. ఈ ధోరణిలో కొంతదూరం వెళ్ళేసరికి ఎదురుదెబ్బ తగలబోయింది.

"అబ్బీ! నువ్వు జెప్పే కొత్త పన్నులన్నీ నీవాడలో ఉన్న వారికే తగుల్తాయి. అజ్జాసుకున్నావో లేదో" అని గర్జించారు ఆ వాడవారు.

సుబ్బారావు అదిరిపడ్డాడు.

"వెధవ సైకిలు పన్ను కోసం ఇన్ని అఘాయిత్యాలు తలపెడితే, ఇవన్నీ జరగవు సరికదా నువ్వు మళ్ళీ నిలబళ్ళేవు కౌన్సిలులో" అని హెచ్చరించారు.

"ఊరు బాగుకోరి..." అనబోయాడు సుబ్బారావు.

"ఏం? మేం మాత్రం ఊరు కామా? ఊరులో ఈ వాడ కూడా భాగమేగా? దీని బాగు నెందుకు కోరవు? నిన్ను ఎన్నుకున్నదాన్ని కాకులకేసి ఊరు నుద్ధరించేదేవిటి? ఏరు దాటాకా తెప్ప తగలేస్తావా?" అన్నారు చేంబరు వగైరాలవారు.

"ఊళ్ళో జనం ఓహో అని నిన్ను మెచ్చుకున్నా గట్టిగా ఎలక్షనుకు నిలబడితే ఓట్లు అటేపువాళ్ళకే వేస్తారు. మా మద్దతు లేందే నువ్వు నిలవ్వు. ఆటిరావు" అని తెలియజేశారు.

అదే ఆ కౌన్సిలుకు ఆఖరు మీటింగు. తరువాత ఎన్నికలూ, కొత్త కౌన్సిలూను.

సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. ఏం జెయ్యాలి? ఊరంతటి మేలు కోరి, ఎక్కువమంది బాగు కోరి, సైకిలు పన్ను తీయించాలా? తన వాడ అభిప్రాయం మన్నించి ఆ ఉద్యమం మానుకోవాలా? వూరు ముఖ్యమా? వాడ ముఖ్యమా? ఈ రెండు ప్రశ్నలకు తాడు బోసి ఉయ్యాల వేసి వూగుతూ నిద్రపోయాడు సుబ్బారావు.

నువ్వు చెప్పు సుబ్బరాజూ అతనెట్లా మొగ్గాలి? ఊరు ముఖ్యమా వాడ ముఖ్యమా అన్నారు రెడ్డిగారు కథ ఆపుజేసి.

"దేశంకన్నా రాష్ట్రం, రాష్ట్రంకన్నా వూరు, వూరుకన్నా వాడ, వాడకన్నా పార్టీ, పార్టీకన్నా గ్రూపు, గ్రూపుకన్నా నాయకుడు, నాయకుడికన్నా అతని పెట్టుబడిదారూ, అతనికన్నా 'నేను' ముఖ్యం అని రాజనీతిలో అంటారు. సుబ్బారావుకూ అంతే. వూరు బాగు వూరంతా చూస్తారు. తన వాడ బాగు తను చూడాలి. ముఖ్యంగా ఇలాటివొచ్చినప్పుడు మరీను. అదీగాక ఇతను మళ్ళీ ఎన్నికయి పదవిలో ఉండాలంటే తన వార్డులో మద్దతే ముఖ్యం గాబట్టి, తను ఎన్నిక కావడం సైకిలు పన్ను రద్దుకన్నా ముఖ్యం కాబట్టి అతను పన్ను గొడవ వదిలేసుకొని తన వాడ మాటలే మన్నించాలి."

"ఊరుకన్నా వాడే ముఖ్యం. ఓటే ముఖ్యం" అన్నాడు సుబ్బరాజు.